సాక్షి ఖమ్మం

శనివారం । 18 । అక్టోబర్ । 2025

గరిష్టం / కనిష్టం
32 / 21°

వాతావరణం
జిల్లా అంతటా శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం సమయాన ఎండ పెరిగే అవకాశముంది.

మధిరలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, పార్టీలు, సంఘాల నాయకులు



పత్రికా స్వేచ్ఛను హరించొద్దు



పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పాత్రికేయలోకం డిమాండ్ చేసింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కల్తీ మద్యం వ్యవహారంపై 'సాక్షి' పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో 'సాక్షి' యాజమాన్యంతో పాటు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టింది. సంస్థ కార్యాలయాల్లోకి జొరబడి నిర్బంధ విచారణ సాగిస్తోంది. తరచూ నోటీసులు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో శుక్రవారం జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన చేపట్టారు. నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించారు. సాక్షి పత్రికపై ఏపీ ప్రభుత్వం కక్ష గట్టి వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రభుత్వాలకు మనుగడ ఉండదని, తప్పిదాలను ఎత్తి చూపితే సరిచేసుకోవాలే కానీ నేరంగా భావించకూడదని పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్, ఇతర జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

IIలో

న్యూస్‌రీల్

రైతుల బీమా కోసం రూ.17.53 లక్షలు



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, ఎండీ, డైరెక్టర్లు

ఖమ్మం అర్బన్: టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ సేవా సంఘం లిమిటెడ్‌లో సభ్యులైన రైతులకు బీమా ప్రీమియం చెల్లించాలని పాలకవర్గ సమావేశంలో నిర్ణయించారు. ఖమ్మం రాధాకృష్ణనగర్‌లోని సంఘం కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ నాగచంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం జరగగా రుణాల వసూళ్లలో వేగం పెంచి, కొత్త రుణాల మంజూరు చేయాలని తీర్మానించారు. అంతేకాక రూ.1.09 లక్షలతో పాలేరు నియోజకవర్గం గోకినపల్లిలో ఎరువుల గోదాం నిర్మాణం, బంగారం తాకట్టు రుణాలు గ్రాముకు రూ.5,700 నుంచి రూ.7వేలకు పెంచాలని నిర్ణయించారు. ఇంకా 59ఏళ్ల లోపు 2,737మంది సభ్యులకు బీమా కోసం రూ.630 చొప్పున రూ.17.53 లక్షల ప్రీమియం చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం ఎండీ లక్ష్మీప్రసన్న, సీఈఓ బి.అశోక్, వైస్ చైర్మన్ తమ్మినేని విజయలక్ష్మి, డైరెక్టర్లు వాకధాని రాంనారాయణ, కుర్ర భాస్కరరావు, రావెల కిషన్, మన్నేపల్లి రవి, లింగా నాగార్జున, భూక్యా ఉపేందర్, పొన్నం వెంకటేశ్వర్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భూగర్భ కేబుల్ పనుల పరిశీలన



కేబుల్ పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్, ఉద్యోగులు

మధిర: మధిరలోని ఆత్కూర్ క్రాస్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా నందిగామ బైపాస్ వరకు రూ.28 కోట్ల వ్యయంతో వేస్తున్న భూగర్భ విద్యుత్ లైన్ పనులను ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వంగూరి మోహన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఉద్యోగులతో కలిసి పనులను పరిశీలించిన ఆయన త్వరగా పూర్తయ్యేలా వేగం పెంచాలని సూచించారు. తొలుత డైరెక్టర్‌ను ఉద్యోగులు సన్మానించారు. చీఫ్ ఇంజనీర్ తిరుమలరావు, డీఈలు బండి శ్రీనివాసరావు, భద్రుపవార్, ఏడీఈ ఎం.అనురాధ, ఏఈ ఎస్.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు

కల్లూరు రూరల్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది నిబంధనల మేరకు వ్యవహరించాలని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ స్పష్టం చేశారు. కల్లూరు మండలం చంద్రుపట్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీఎస్ఓ చందన్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 327 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రతీ కేంద్రంలో ప్యాడీ క్లీనర్లు, ఎలక్ట్రానిక్ కాంటా సిద్ధం చేసుకోవడమే కాక ఒక్కో బస్తాలో 40.700 కేజీ ధాన్యమే నింపాలని సూచించారు. కాంటాలు, మిల్లులకు తరలింపులో పొరపాట్లకు తావివ్వొద్దని ఆయన ఆదేశించారు.

'చాంబర్' ఎన్నికల షెడ్యూల్ విడుదల

నవంబర్ 16న పోలింగ్, అదేరోజు ఫలితాలు



షెడ్యూల్ విడుదల చేస్తున్న ఎన్నికల అధికారి, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి పీబీ.శ్రీరాములు శుక్రవారం విడుదల చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీస్ బేరర్ల పదవులతో పాటు 18 శాఖల పదవులకు నవంబర్ 16న ఎన్నిక నిర్వహించనున్నారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరించి, 30వ తేదీన పరిశీలిస్తారు. ఇక 31న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇచ్చి బరిలో మిగిలిన వారి జాబితా విడుదల చేస్తారు. ఆపై నవంబర్ 16న పోలింగ్ నిర్వహించి అదేరోజు ఓట్లు లెక్కించి ఫలితాలు విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు సోమ నరసింహారావు, మన్నెం కృష్ణ పాల్గొన్నారు.

ఆరేళ్ల తర్వాత కొత్త అధ్యక్షుడి నియామకం

- నేటితో ముగియనున్న అభిప్రాయ సేకరణ
- ముగ్గురు మంత్రుల ఏకాభిప్రాయంతోనే ఎంపిక
- అధ్యక్ష పదవి కోసం 30కి పైగా దరఖాస్తులు

ఖమ్మంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం





డీసీసీ సారథి ఎవరో ?!

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎంపిక ప్రక్రియ తుదిదశకు చేరింది. ఆరేళ్ల తర్వాత కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షుల నియామకం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శ్రేణులను కలుపుకుపోయే, సమర్థవంతంగా పార్టీని ముందుకు నడిపించే సత్తా కలిగిన నేతను ఎంపిక చేయడంపై అధిష్టానం దృష్టి సారించింది. ఈక్రమాన ఈనెల 11 నుంచి పార్టీ నేతల నుంచి ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్ చేపట్టిన అభిప్రాయ సేకరణ శనివారంతో ముగియనుంది. అనంతరం దరఖాస్తులు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను క్రోడీకరించి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల ఏకాభిప్రాయంతో జిల్లా అధ్యక్ష పదవికి అర్హత కలిగిన నేతల పేర్లను అధిష్టానానికి పంపనున్నట్లు సమాచారం. అయితే పదవి కోసం ఇప్పటికే 30 మందికి దరఖాస్తు చేసుకోగా.. ఎవరిని ఎంపిక చేస్తారోనన్న ఉత్కంఠ నెలకొంది.

2019 తర్వాత..

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పీసీసీ అధ్యక్షులు మారినప్పుడల్లా డీసీసీ అధ్యక్షులూ మారారు. అయితే, ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా అయితం సత్యం మృతి తర్వాత 2019 ఫిబ్రవరి 7న పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం నగర అధ్యక్షుడిగా జావెద్ నియమితులయ్యారు. అప్పటి నుంచి వీరి ఆధ్వర్యాన పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు అధిష్టానం నిర్ణయంతో అధ్యక్ష మార్పు అనివార్యంగా మారింది.

ముగిసిన అభిప్రాయ సేకరణ

జిల్లా, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎంపిక కోసం అభిప్రాయాల సేకరణకు ఈనెల 11న ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్ వచ్చారు. అదే రోజు ఖమ్మం నియోజకవర్గ నాయకులతో సమావేశమైన ఆయన ఆతర్వాత పాలేరు, సత్తుపల్లి, వైరా, మధిర నియోజకవర్గ శ్రేణులతో సమావేశమై అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అలాగే, నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ ప్రప్రక్రియ శనివారంతో ముగియనుండగా ఆశావహుల అర్హతల వివరాలు, వెల్లడైన అభిప్రాయాలతో నివేదికను అధిష్టానానికి పంపనున్నారు.

మంత్రులు ఓకే చేస్తేనే..

అభిప్రాయాలు సేకరణ, దరఖాస్తుల స్వీకరణ చివరి దశకు చేరినా డీసీసీ అధ్యక్ష పదవి ఎంపికలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయాలు కీలకం కానున్నాయి. ఏఐసీసీ పరిశీలకుడు ఆశావహుల్లో అర్హుల జాబితాను అధిష్టానానికి పంపాక మంత్రుల అభిప్రాయాలను తీసుకోనున్నట్లు తెలిసింది. ఆతర్వాతే అధ్యక్ష పదవి ఖరారవుతుందని సమాచారం. కాగా, శుక్రవారం ఖమ్మం వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి డీసీసీ కార్యాలయంలో ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్‌ను కలిసి ఇప్పటి వరకు జరిగిన సమావేశాలపై చర్చించారు.

అధ్యక్ష పీఠం అధిష్టించాలని..

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం పలువురు పోటీ పడుతున్నారు. జిల్లాలో పార్టీ బలంగా ఉండడం, పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యాన అధ్యక్ష పదవికి ప్రాధాన్యత పెరిగింది. ఇప్పటికే 30మందికి పైగా నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎవరికి వారు అధ్యక్ష పదవి దక్కించుకోవడం ద్వారా సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. మంత్రులతో సమానంగా తమకు కూడా గుర్తింపు దక్కుతుందనే అంచనాతో పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ముగ్గురు మంత్రుల అనుచరులు ఎవరికి వారు తమకు అధ్యక్ష పదవి దక్కేలా చూడాలంటూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధిష్టానం మాత్రం బలమైన నేతతోపాటు సామాజిక సమీకరణలు, అందరినీ కలుపుకుపోయే వ్యక్తినే ఎంపిక చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈనేపథ్యాన ముగ్గురు, నలుగురు నేతల పేర్లతో జాబితా రూపొందించి.. ఆపై ముగ్గురు మంత్రులు, ఇతర నేతలు ఏకాభిప్రాయంతో అధ్యక్ష పదవికి నేతను ఎంపిక చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి



హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన మేయర్, కమిషనర్ తదితరులు

- ప్రజల అంగీకారంతోనే రోడ్డు వెడల్పు పనులు
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం అర్బన్: జిల్లా కేంద్రంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం ముస్తఫానగర్‌లో రూ.3 కోట్లతో నిర్మించే బీసీ బాలుర వసతి గృహం పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ముస్తఫానగర్‌లో బీసీ వసతి గృహ నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు చేయగా, నగరంలోని కూలే స్థితిలో ఉన్న మరో మూడు హాస్టళ్లకు కూడా రూ.9 కోట్లు కేటాయించామని తెలిపారు. భవనాలు కలకాలం నిలిచేలా నాణ్యతతో నిర్మించాలని సూచించారు. కాగా, ప్రజల అంగీకారంతోనే బోనకల్ రోడ్డును విస్తరిస్తామని మంత్రి తెలిపారు. అయితే, అభివృద్ధి కోసం రోడ్డు వెడల్పు పనులకు ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు. నష్టపోయే వారికి పరిహారం అందిస్తామని చెప్పారు. ఇక రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి.. కార్పొరేటర్లు వారి డివిజన్లలో విస్తరించాల్సిన రోడ్ల వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఇక నగరంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం రూ.220 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ నిధులతో చేపట్టే పనులతో రానున్న వేసవిలో తాగునీటి కొరత రాకపోగా, ప్రతి ఇంటికీ శుద్ధమైన నీరు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు, నాయకులు రోజ్‌లీలా, కమర్తపు మురళి, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, అశోక్, తుపాకుల యలగొండ స్వామి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి జ్యోతి, ఆర్డీఓ నర్సింహారావు, ఈఈ రంజిత్, కృష్ణలాల్, సహాయ కమిషనర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంలో ఒకరిపై వేటు

వైరా మున్సిపాలిటీల ఉద్యోగి సస్పెన్షన్

వైరా: వైరా మున్సిపాలిటీ నిధుల దుర్వినియోగంలో కీలకపాత్ర పోషించినట్లు భావిస్తూ ఇంజనీరింగ్ విభాగం జూనియర్ అసిస్టెంట్ ఐతంరాజు వెంకటేశ్వర్లును సస్పెండ్ చేశారు. మున్సిపాలిటీకి సంబంధించి రూ.54లక్షల మేర నిధులను ఆయన సొంత ఖాతాకు మళ్లించుకున్నట్లు ఆలస్యంగా గుర్తించారు. ఈమేరకు పత్రికల్లో కథనాలు రావడంతో వరంగల్ ఆర్‌డీఎం షాహీద్ మసూద్ ఈనెల 14న మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. మున్సిపాలిటీలో రూ.2 కోట్ల జనరల్ ఫండ్ నిధుల్లో రూ.54 లక్షలు దుర్వినియోగం అయ్యాయని తేలడంతో బాధ్యుడిగా వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పేరుతో చెక్కులు రాసి సొంత ఖాతాలోకి మళ్లించుకున్నాడని.. ఆ సమయాన చెక్కుల వివరాలను కూడా క్యాష్ బుక్‌లో నమోదు చేయలేదని గుర్తించారు. అప్పటి కమిషనర్ చింతా వేణు సైతం చెక్కులు, రికార్డులు పరిశీలించకుండా సంతకం చేసినట్లు తేలినా ఆయనపై మాత్రం చర్యలు తీసుకోలేదు.

22 నుంచి సామూహిక సత్యనారాయణ వ్రతాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ఈనెల 22 నుంచి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈఓ దామోదర్‌రావు తెలిపారు. కార్తీక మాసంలో ప్రతీ శని, ఆది, సోమవారాల్లో వ్రతాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు ఆయా రోజుల్లో ఉదయం 8గంటలలోపు రూ.516 చెల్లించి టికెట్ తీసుకోవాలని తెలిపారు.

సోలార్ విద్యుదుత్పత్తి పెంపు

- విద్యుత్ ఉద్యోగులు బాధ్యతతో పనిచేస్తేనే ఫలితం
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన సీఎండీ వరుణ్‌రెడ్డి, ఖమ్మం కలెక్టర్ అనుదీప్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు ప్రణాళికలు రూపొందించడమే కాక ఆసక్తి ఉన్న రైతుల పొలాల్లోనూ సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. ఖమ్మం కలెక్టర్ పేర్కొన్నట్లు భవిష్యత్ అవసరాల దృష్ట్యా సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక అవసరాల దృష్ట్యా రెండు 400 కేవీ సబ్ స్టేషన్లు మంజూరు చేస్తామని తెలిపారు.

'పొలం బాట'తో పరిష్కారం

వంగిన స్తంభాలు, లూజ్ వైర్ల సమస్యలను ప్రతీ వారం చేపట్టే పొలం బాటలో గుర్తించి పరిష్కరించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వరదల, వర్షాల సమయాన ప్రాణాలకు తెగించి మరీ సిబ్బంది పని చేస్తున్నారని కొనియాడారు. అయితే, స్వార్థంతో వ్యవహరించే ఇంకొందరు శాఖ పేరు చూడగొట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈమేరకు లైన్‌మెన్ మొదలు సీఎండీ వరకు బాధ్యతలు నిబద్ధతతో నిర్వహిస్తే విద్యుత్ శాఖ మంచి ఫలితాలను సాధిస్తుందని తెలిపారు. ఇక గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రావొద్దని, వ్యవసాయ కనెక్షన్లు త్వరగా మంజూరు చేయాలన్నారు. అంతేకాక నీటి పారుదల కాల్వలు, భూముల వద్ద సోలార్ విద్యుత్ ప్యానళ్లు, మీడియం ప్రాజెక్టుల వద్ద ఫ్లోటింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దేవాదాయ భూముల్లోనూ కూడా ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు.

అందుబాటులో అత్యవసర వాహనాలు

విద్యుత్ సరఫరాలో లోపాలు ఎదురైన చోటకు పరికరాలతో సిబ్బంది వెళ్లేలా ఎమర్జెన్సీ వాహనాలు అందుబాటులో ఉన్నాయని, వీటికి జీపీఎస్ ఏర్పాటు చేశామని ఎన్పీడీసీఎల్ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ప్రతీ వారం పొలంబాట నిర్వహిస్తుండగా, విద్యుత్ ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. గృహజ్యోతి పథకం కింద రెండు ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 10 లక్షలకు పైగా కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ఖమ్మం మయూరి సెంటర్, బస్టాండ్ ఏరియాలో డిమాండ్ పెరగడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. అక్కడ ఎన్నెస్పీ భూమి ఉన్నందున ఇండోర్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే, జిల్లా కేంద్రంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు టి.సదర్‌లాల్, కె.తిరుమల్‌రావు, రాజుచౌహాన్, ఆర్.చరణ్‌దాస్, ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు పాల్గొన్నారు.

2వేలు దాటిన వైన్స్ దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ ఉద్యోగులు

ఖమ్మంక్రైం: నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లాలోని 116 వైన్స్ షాపులకు టెండర్ల స్వీకరణ గడువు శనివారంతో ముగియనుంది. అయితే, ఇన్నాళ్లు తక్కువగా దరఖాస్తులు అందగా, శుక్రవారం వీటి సంఖ్య పెరిగింది. ఇప్పటివరకు ఇప్పటి వరకు 2,050 దరఖాస్తులు అందగా, రూ.3లక్షల చొప్పున ఎక్సైజ్ శాఖకు రూ.61.50కోట్ల ఆదాయం సమకూరింది. చివరిరోజైన శనివారం భారీగా దరఖాస్తులు నమోదయ్యే అవకాశముండడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం సాయంత్రం 5గంటల వరకు క్యూలో ఉన్న ప్రతీ ఒక్కరి దరఖాస్తు స్వీకరిస్తామని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. మొత్తంగా దరఖాస్తు ఫీజు రూపంలో రూ.100కోట్లకు పైగా ఆదాయం లభించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

చేప పిల్లల పంపిణీకి సిద్ధం

- జిల్లాలో 882 జలాశయాల గుర్తింపు
- 3.48 కోట్ల పిల్లల విడుదలకు ఏర్పాట్లు



చేపపిల్లలు

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది కాస్త ఆలస్యమైనా ఎట్టకేలకు ఉచిత చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ సిద్ధమైంది. ఆగస్టు ఆరంభం నుంచే కసరత్తు చేస్తుండగా వివిధ కారణాలతో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో టెండర్ల ప్రక్రియలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు సెప్టెంబర్ చివరి వారంలో కాంట్రాక్టర్లు పాల్గొనగా టెండర్లు ఖరారు చేశారు. ఈమేరకు జిల్లాలోని 882 జలాశయాల్లో చేపపిల్లల విడుదలకు ముగ్గురు కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. మొత్తం 3.48 కోట్ల చేపపిల్లలను విడుదల చేయనున్నారు. ఇందులో 80–100 మి.మీ.ల చేప పిల్లలు 2.16 కోట్లు, 35–40 మి.మీ. పొడవైనవి 1.32 కోట్లు ఉంటాయి. పెద్ద చేప పిల్లకు రూ.1.70, చిన్న చేపలకు 68 పైసలను కాంట్రాక్టర్లకు చెల్లించేలా ధర ఖరారైంది. మొత్తంగా ప్రభుత్వం జిల్లాకు రూ.4.42 కోట్లు కేటాయించగా, విడుదల చేసే చేపపిల్లల్లో బొచ్చ, రవ్వ, బంగారు తీగ, మోసు తదితర రకాలు ఉన్నాయి.

త్వరలోనే విడుదల

టెండర్లు ఖరారైన నేపథ్యాన జిల్లాలోని జలాశయాల్లో త్వరలోనే చేపపిల్లలు విడుదల చేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌లో ఉచిత చేప పిల్లల పంపిణీని ప్రభుత్వం శుక్రవారం లాంఛనంగా ప్రారంభించింది. ఒకటి, రెండు రోజుల్లో జిల్లాలోనూ చేపపిల్లల పంపిణీ మొదలయ్యే అవకాశముందని జిల్లా మత్స్య శాఖాధికారి శివప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని జలాశయాలు నిండా నీటితో కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యాన చేప పిల్లలను విడుదల చేస్తే మార్చి, ఏప్రిల్ నాటికి అవి పెరగనున్నాయి. జిల్లాలో సుమారు 16వేల మంది మత్స్యకారులు చేపల వేట, అమ్మకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

స్వయం ఉపాధి.. ఆర్థిక స్వావలంబన

- ఇందిరా డెయిరీతో 20వేల మంది మహిళలకు లబ్ధి
- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



కేంద్రం నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

బోనకల్: ఇందిరా డెయిరీ ఏర్పాటుతో మహిళలకు ఉపాధి లభించి ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. డెయిరీలో వాటాదారులుగా చేరిన మధిర నియోజకవర్గంలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రెండేసి పాడిగేదెలను సబ్సిడీ పంపిణీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. బోనకల్‌లోని పాల శీతలీకరణ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించిన ఆమె డెయిరీ కేంద్రాలకే పాలు అప్పగించేలా మహిళల్లోఅవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం నియోజకవర్గ స్థాయి లబ్ధిదారులతో సమావేశమైన అదనపు కలెక్టర్ ఇప్పటివరకు అందిన గేదెల పోషణ, పాల ఉత్పత్తిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 125 మంది లబ్ధిదారులకు సబ్సిడీపై గేదెలు పంపిణీ చేయగా, నచ్చిన గేదెలు కొనుగోలు చేసుకునే వెసలుబాటు కల్పించినట్లు తెలిపారు. ఇప్పటికే ఎర్రుపాలెం మండలంలో రోజుకు 10వేల లీటర్ల పాలు కొనుగోలు చేసేలా బల్క్ మిల్క్ చిల్లింగ్(బీఎంసీ) సెంటర్ నిర్మించామన్నారు. అక్కడ పాల సేకరణ చేపడుతుండడంపై ఆమె అభినందించారు. మిగిలిన నాలుగు మండలాల్లోనూ బీఎంసీలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో 60 వేల మంది సభ్యుల లక్ష్యం కాగా, మొదటి విడతలో 20 వేల మందికి లబ్ధి జరగనుందని అదనపు కలెక్టర్ తెలిపారు.

అధికారులపై ఆగ్రహం

పాల శీతలీకరణ కేంద్రం నిర్మాణ పనులు సక్రమంగా నిర్వహించడం లేదని అధికారులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాల శీతలీకరణ కేంద్రానికి వచ్చి, వెళ్లే మార్గాలపై సరైన నిర్ణయం తీసుకోకుండా నిర్మాణం చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. పాల వాహనాల రాకపోకలు ఎలా సాగుతాయని అసహనం వ్యక్తం చేసిన ఆమె ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేస్తున్నారంటూ ఏపీఎం, డీపీఎం, ఏఈలపై మండిపడ్డారు. తొలుత మండలంలోని ముష్టికుంట్లలో భవిత భవన నిర్మాణాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్.. పాఠశాలలో గదులు ఉన్నా అదనంగా నిర్మిస్తుండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఉన్న గదులను ఉపయోగించుకోకుండా ప్రభుత్వ ధనం వృథా చేయడం సరికాదని, ఉద్యోగుల వేతనాల్లో కోత విధిస్తే ఎలా ఉంటుందో ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య, డీపీఎం శ్రీనివాస్, ఏపీడీ జయశ్రీ, ఇందిరా డెయిరీ ప్రత్యేకాధికారి రాజారావు, ఏపీఎంలు లక్ష్మణరావు, తిరుమలరావు తదితరులు

క్లుప్తంగా

నిమ్మతోటల్లో సస్యరక్షణ చర్యలు



తోటలో పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి మధుసూదన్

వేంసూరు: నిమ్మ తోటలను చీడపీడలు ఆశిస్తున్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి ఎంవీ.మధుసూదన్ సూచించారు. వేంసూరు మండలం రాయుడుపాలెంలో పలువురు రైతులు సాగు చేస్తున్న నిమ్మ తోటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా సిమెంట్ స్తంభాలు పాతి తీగ జాతి పంటల సాగుకు అవకాశముందని తెలిపారు. ఎకరాకు రూ.లక్ష మేర సబ్సిడీ అందనున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల ఉద్యాన అధికారి శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

అందరి ఆమోదంతోనే ఎన్నిక



నాయకుల అభిప్రాయాలు సేకరిస్తున్న మహేంద్రన్

మధిర/చింతకాని: పార్టీ కార్యకర్తల అభీష్టం, అభిప్రాయాల మేరకే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నేతలను ఎంపిక చేస్తామని ఏఐసీసీ పరిశీలకులు మహేంద్రన్ స్పష్టం చేశారు. మధిర, చింతకాని మండలం నాగులవంచలో శుక్రవారం వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మధిర నియోజకవర్గంలోని మధిర,బోనకల్, ఎర్రుపాలెం, చింతకాని, ముదిగొండ మండలాల నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం మహేంద్రన్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టించిన నాయకులకే పదవి దక్కుతుందని.. ఈ ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా పరిశీలకురాలు రవళి, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, నూతి వీరభద్రం, అంబటి వెంకటేశ్వర్లు, కొప్పుల గోవిందరావు, తోటకూరి ప్రగతి, కొమ్మినేని రమేష్, పసుపులేటి దేవేంద్రం, మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి,బండెల నాగార్జున పాల్గొన్నారు.

ఉద్యాన అధికారి వేణుకు 'రైతునేస్తం' అవార్డు



ఆకుల వేణు

ఖమ్మంవ్యవసాయం: ఉద్యాన పంటల సాగులో రైతులకు విస్తృతంగా అవగాహ న కల్పించినందుకు వైరా ఉద్యాన అధికారి డాక్టర్ ఆకుల వేణు రైతునేస్తం పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల స్థాయిలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, అధికారులను పద్మశ్రీ డాక్టర్ ఐవీ.సుబ్బారావు పేరిట ఇచ్చే అవార్డులకు ఎంపిక చేశారు. జిల్లా నుంచి వైరా డివిజన్ ఉద్యాన అధికారి వేణుకు స్థానం దక్కగా ఈనెల 26న హైదరాబాద్‌లో అవార్డు స్వీకరిస్తారు. డాక్టర్ వేణు ఉద్యాన విద్యలో మాస్టర్స్ డిగ్రీతో పాటు పీహెచ్‌డీ చేయగా.. పంటల సాగులో ఆధునిక విధానాలపై రైతులకు అవగాహన కల్పించడమే కాక మియాజాకీ, అవకాడో, మెకాడ్మియా తదితర పంటలను పరిచయం చేశారు. కాగా, వేణుతో పాటు గతంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉద్యాన అధికారి పనిచేసి ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న జినుగు మరియన్న అవార్డుకు ఎంపికయ్యారు.

'ఏరుగట్ల' లబ్ధిదారులకు న్యాయం చేయండి



కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/పెనుబల్లి: పెనుబల్లి మండలం ఏరుగట్లలోని డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఖమ్మంలో శుక్రవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డికి శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏరుగట్లలో డబుల్‌బెడ్ రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలపై విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలన్నారు. తొలుత స్థలం ఇచ్చిన 15మంది అర్హులకే ఇళ్లు కేటాయించాలని కోరారు. అంతేకాక గ్రామస్తులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, ఈ.వీ.రమేష్, విజయరాజ్, భాస్కర్ల వీరంరాజు, బొర్ర నరసింహారావు, సుదర్శన్ మిశ్రా, మట్టా ప్రసాద్, పడిగల మధుసూదన్, పర్సా రాంబాబు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కదం తొక్కిన జర్నలిస్టులు

- 'సాక్షి' పత్రిక, ఎడిటర్‌పై అక్రమ కేసులకు నిరసన
- ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు
- పార్టీలు, సంఘాలకు అతీతంగా నాయకుల మద్దతు



మధిర తహసీల్ ఉద్యోగికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



సత్తుపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుపుతున్న జర్నలిస్టులు, సంఘాల నాయకులు

మధిర: ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, పాలకుల తప్పులను ఎత్తిచూపడం బాధ్యతగా భావించే మీడియా గొంతు నొక్కాలని, స్వేచ్ఛను హరించివేయాలని కుట్ర పన్నిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీరు గర్హనీయమని వివిధ పార్టీలు, సంఘాలతో పాటు జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయించడమే కాక పత్రికకు నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మధిర అంబేద్కర్ సర్కిల్‌లో జరిగిన నిరసనలో జర్నలిస్టులు, పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతిని ప్రజల ముందు ఉంచడమే తప్పుగా 'సాక్షి'పై అక్రమ కేసులు బనాయిస్తూ మీడియా గొంతు నొక్కేలా ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. అనంతరం తహసీల్ వరకు ర్యాలీకి వెళ్లి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్, బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు మిరియాల వెంకటరమణ గుప్తా, తూమాటి నవీన్‌రెడ్డి, బెజవాడ రవిబాబు, మడుపల్లి గోపాలరావు, చిత్తారు నాగేశ్వరరావు, చిలివేరు సాంబశివరావు, కుంచం కృష్ణారావు, ఏనోకు మాదిగ, కనకపూడి శీను మాదిగ, మధిర ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పాగి బాలస్వామి, గౌరవ అధ్యక్షుడు మక్కెన నాగేశ్వరరావుతో పాటు జర్నలిస్టులు అట్లూరి సాంబిరెడ్డి, చేకూరి వినోద్, పల్లపోతు ప్రసాదరావు, సురభి వెంకన్న, గంధం శ్రీనివాసరావు, కాశిబోయిన రామారావు, కందిమళ్ల వీరస్వామి, మిరియాల శ్రీనివాసరావు, శ్రీరామోజు యోగేష్, రావిరాల శశికుమార్, ధనిశెట్టి శ్రీనివాసరావు, తాళ్లూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు గర్హనీయం

సత్తుపల్లి: ప్రతికా స్వేచ్ఛపై దాడి చేయడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం వ్యవహరించడం దురదృష్టకరమని వక్తలు పేర్కొన్నారు. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై వరుసగా ఏపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం గర్హనీయమన్నారు. ఈమేరకు సత్తుపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తోట కిరణ్(టీయూడబ్ల్యూజే-టీజేఎస్), మాచినేని బాలకృష్ణ (టీడబ్ల్యూయజే-ఐజేయూ) మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రతికా స్వేచ్ఛను హరించడమేనని మండిపడ్డారు. జర్నలిస్టు సంఘాల ఐక్యతతోనే ప్రభుత్వాల నియంతృత్వ పోకడలను అడ్డుకోవచ్చని తెలిపారు. బీసీ సంఘం, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్, ఎమ్మార్పీఎస్, వడ్డెర సంఘం, లంబాడీ హక్కుల సంఘం నాయకులు నారాయణవరపు శ్రీనివాస్, గాదె చెన్నారావు, దండు ఆదినారాయణ, సర్వేశ్వరరావు, అమర్లపూడి శరత్, పిల్లి మల్లికార్జున్, శ్రీనివాసరావు, తన్నీరు జమలయ్య, నందు నాయక్‌తో పాటు మసీద్ కమిటీ, లయన్స్‌క్లబ్ బాధ్యులు ఎం.డీ.కమల్‌పాషా, రవి, మందపాటి ప్రభాకర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. జర్నలిస్టులు ఎం.డీ.షైబుద్దీన్, భీమిశెట్టి రఘురామారావు, ఎస్.కే.ఖాదర్‌బాబా, బీ.వీ.రామారావు, జీడిమళ్ల శ్రీనివాసరావు, కొవ్వూరు సాంబశివరావు, బొర్ర కోటేశ్వరరావు, గోపరాజు గోపి, నర్రా అరుణ్, బాబు, రామిశెట్టి లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, ఐ.శ్రీనివాసరావు, సతీష్, ఎస్.కే.మీరా, బాజీ, సురేష్, మహా శ్రీనివాస్, తడికమళ్ల అప్పారావు, గురవయ్య, కొత్తపల్లి సుధాకర్, చీపు గంగాధర్, లింగగిరి రామకృష్ణ, కాకర్ల జగన్, ఎస్.కే.మునీర్, బల్లెం చిరంజీవి, జంగం కిరణ్, అశోక్, ఎండి మేరాజ్, బేతి ఆనంద్, బేతి సునీత, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికే ముప్పు..



వైరాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్షం నాయకులు, జర్నలిస్టులు

వైరా: ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకగా నిలిచే పత్రికలపై ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రజాస్వామ మనుగడకే ముప్పు ఎదురవుతుందని జర్నలిస్టు సంఘాలు, పార్టీల నాయకులు పేర్కొన్నారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పత్రికను ఏపీ ప్రభుత్వం కేసులు పేరుతో వేధింపులకు గురి చేయడాన్ని నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. 'సాక్షి' కార్యాలయానికి నోటీసులు ఇచ్చే పేరుతో పోలీసులు తరచూ రావడం, ఎడిటర్‌పై కేసులు నమోదు చేసి జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్‌లో డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పార్టీలు, సంఘాల నాయకులు, జర్నలిస్టులు శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు, దార్నా రాజశేఖర్, మల్లు రామకృష్ణ, ముళ్లపాటి సీతారాములు, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, యమాల గోపాలరావు, గుజ్జర్లపూడి దేవరాజు, కంకణాల శిరీష, జర్నలిస్టులు పారుపల్లి కృష్ణారావు, సూతకాని ప్రేమ్‌చంద్, షేక్ మహ్మద్ రిజ్వాన్, చంద్రశేఖర్, ఏపూరి రాజారావు, గొల్లమందల విజయ్, పులి కృష్ణార్జున్‌రావు, గద్వాల రవీందర్, షేక్ రఫీ, సూతకాని శ్రీకాంత్, నందిగామ మనోహర్, ప్రశాంత్, భూక్యా శ్రీను, చారి, ఆది శ్రీకాంత్, ఎక్కిరాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'రిజర్వేషన్లపై బీజేపీది ద్వంద్వ వైఖరి'

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రంలోనిబీజేపీ కపట రాజకీయాలు చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయం నుంచి సరితా క్లినిక్ సెంటర్ వరకు శుక్రవారం ర్యాలీగా వెళ్లి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఆర్డినెన్స్‌ను అడ్డుకోగా.. ఇంకోవైపు బీసీ జేఏసీ బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వడం గర్హనీయమన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేసే పూర్తి బాధ్యత కేంద్రానిదేనని తెలిపారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈసమావేశంలో సీపీఎం నాయకులు వై.విక్రమ్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీనివాసరావు, బండి పద్మ, నందిపాటి మనోహర్, బండారు రమేష్, తుమ్మ విష్ణువర్ధన్, పిన్నింటి రమ్య, ఎంఏ.జబ్బార్, షేక్ మీరా సాహెబ్, ఎస్ నవీన్ రెడ్డి, దొంగల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో పాట్లు అమ్మిన ఇద్దరిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని కొత్తగూడెం ప్రాంతంలో అసైన్డ్ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించిన ఇద్దరిపై కేసులు నమోదయ్యాయి. ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ శుక్రవారం తెలిపిన వివరాలు... ధంసలాపురం రెవెన్యూ పరిధి కొత్తగూడెం సమీపాన సర్వేనంబర్ 408లో ఉన్న అసైన్డ్ భూముల్లో 200 గజాలను దాకూరి కోటేశ్వరికి జె.వెంకటేశ్వర్లు విక్రయించి రూ.5లక్షలు తీసుకున్నాడు. అలాగే, అదే సర్వే నంబర్‌లోని 121 గజాలను రూ.3లక్షల ధరతో ముస్తఫానగర్ వాసి మహమ్మద్ అఫ్జల్‌కు జె.లక్ష్మయ్య విక్రయించాడు. వీరిపై వేర్వేరు అందిన ఫిర్యాదులతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కళాశాల భవనం పైనుంచి పడిన విద్యార్థి

రఘునాథపాలెం కేజీబీవీలో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీవల్లి

రఘునాథపాలెం: మండలంలోని కేసీఆర్ కాలనీ ఎదురుగా ఉన్న కస్తూర్బా జూనియర్ కళాశాల విద్యార్థి భవనం రెండో అంతస్తు నుంచి పడగా తీవ్రగాయాలయ్యాయి. కూసుమంచి మండలం ధర్మతండాకు చెందిన జర్పుల సుమన్ కుమార్తె శ్రీవల్లి కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం తెల్లవారుజామున స్టడీ అవర్‌కు శ్రీవల్లి రాకపోవడంతో గదిలో పరిశీలించాక చుట్టుపక్కల గాలిస్తుండగా పోర్టికో పక్కన రక్తపు మడుగులో గుర్తించారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స విషయమై ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించారని శ్రీవల్లి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో వదిలేసి వెళ్లిపోతే రోజువారీ కూలీచేసే తాము చికిత్స కోసం రూ.లక్ష చెల్లించినా పరిస్థితి మెరుగుపడలేదని తెలిపారు. శ్రీవల్లి రెండో అంతస్తు నుంచి ఎలా పడిందో తెలియడం లేదని, పోలీసులు రాకముందే రక్తం మరకలు ఎందుకు తుడిచారని ప్రశ్నించారు. గురుకులం ప్రత్యేక అధికారి వై.లత మాత్రం రెండు రోజులుగా శ్రీవల్లి పీడకలలు వస్తున్నాయని చెప్పగా ఆమె తల్లితో ఫోన్‌లో మాట్లాడితే దీపావళికి తీసుకెళ్తామని చెప్పిందన్నారు. ఆస్పత్రికి స్కానింగ్ తీయించి ప్రమాదం లేదన్న చెప్పాకే తిరిగి వచ్చామని తెలిపారు. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ పాఠశాలకు చేరుకుని వివరాలు ఆరా తీయగా.. ఆస్పత్రిలో మెజిస్ట్రేట్ ద్వారా స్టేట్‌మెంట్ సైతం రికార్డు చేసినట్లు తెలిసింది. అయితే, శ్రీవల్లి భవనం పైనుంచి ఎలా పడిందో తెలియరాలేదు.

కన్నపేగు దూరమై.. కన్నీరుమున్నీరై..

కుమారుడి మృతి తట్టుకోలేక తల్లి కన్నుమూత



నాగాచారి (ఫైల్)



రంగమ్మ మృతదేహం

ఖమ్మంఅర్బన్: కుమారుడు మృతి చెందాడని తెలిసినప్పటి రోదిస్తున్న తల్లి.. ఆయన అంత్యక్రియలు పూర్తిచేసి ఇంటికి చేరిన కొద్దిసేపటికే కన్నుమూసింది. పేగు బంధాన్ని దూరం చేసుకున్న ఆ వృద్ధురాలు ఆవేదనను తట్టుకోలేక మృతి చెందిన విషాద ఘటన ఇది. ఖమ్మంలోని రామన్నపేట డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన మునగంటి నాగాచారి అనారోగ్య సమస్యల కారణంగా గురువారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏకైక కుమారుడి మృతి విషయం తెలిసినప్పటి ఆయన తల్లి రంగమ్మ(75) కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. కాగా, పోస్టుమార్టం అనంతరం శుక్రవారం నాగాచారి మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చాక అంత్యక్రియలకు తీసుకెళ్లారు. ఆతర్వాత అందరితో పాటే ఇంటికి వచ్చిన రంగమ్మ తీవ్ర వేదనతో రోదిస్తూ కుప్పకూలి మృతి చెందింది. రోజు వ్యవధిలోనే తల్లీకొడుకు మృతి చెందగా ఆ కుటుంబంతో పాటు గ్రామంలో విషాదం నెలకొంది.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి



రాము (ఫైల్)

ఎర్రుపాలెం: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ములుగుమాడుకు చెందిన ఇద్దరు స్నేహితులు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన ఆముదాల రాము(24) శుక్రవారం ఉదయం ఖమ్మం ప్రభు త్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కన్నుమూశాడు. ఆయన సోదరుడు రాంబాబు ఫిర్యాదుతో కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

కాల్వలో గల్లంతైన బాలుడు..



మనోజ్ (ఫైల్)

పెనుబల్లి: చేపల వేట కోసం వెళ్లి సాగర్ కాల్వలో గల్లంతైన రేపల్లే మనోజ్(14) మృతి చెందాడు. పెనుబల్లి మండలం వీ.ఎం.బంజరు జంగాల కాలనీకి చెందిన రేపల్లే మనోజ్, పర్వతం శివ తుమ్మలపల్లి వద్ద సాగర్ కెనాల్‌లో గాలాలతో చేపలు పట్టడానికి గురువారం వెళ్లారు. ఈక్రమాన మనోజ్ ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోగా, ఆయన రక్షించే క్రమంలో శివ కూడా నీట మునిగాడు. సమీపాన ఉన్న మేకల కాపరి శివను రక్షించినా మనోజ్ మాత్రం గల్లంతయ్యాడు. దీంతో ఎస్సై కె.వెంకటేష్ ఆధ్వర్యాన గాలింపు చేపట్టగా శుక్రవారం మధ్యాహ్నం మనోజ్ మృతదేహం బయటపడింది.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి..

ఖమ్మంక్రైం: ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం వన్ టౌన్‌సీఐ కరుణాకర్ వెల్లడించిన వివరాలు... ఖమ్మం ముస్తఫానగర్‌లో నివసించే యలగందుల వెంకటేశ్వర్లు(58) వడ్రంగిగా పనిచేస్తున్నాడు. ఆయన శుక్రవారం తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా కుటుంబంతో వచ్చిన సీసీఆర్‌బీ కానిస్టేబల్ కొండపల్లి మురళిబాబు వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు ట్రాఫిక్ పోస్టుకు ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇదే ఘటనలో కానిస్టేబుల్ మురళి, ఆయన కుమార్తె ఆశ్రిత తీవ్రంగా గాయపడగా వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నేటి బంద్‌కు సిద్ధం

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం పిలుపు
- మద్దతు తెలిపిన పార్టీలు, కార్మిక, విద్యార్థి సంఘాలు



బంద్ విజయవంతానికి నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యాన శనివారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా జిల్లాలో బంద్‌ను విజయవంతం చేసేందుకు బీసీ సంఘాల నాయకులు విస్తృత ప్రచారం చేశాయి. అలాగే, శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. గత మూడు రోజులుగా జిల్లాలో నాయకులు విస్తృత ప్రచారం చేయడంతో పాటు పలు పార్టీల మద్దతు కూడగట్టారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్, ఆమ్ ఆద్మీ పార్టీ, తెలంగాణ జన సమితితో పాటు అనుబంధ సంఘాలు, యువజన సంఘాల నాయకులు బంద్‌కు మద్దతు ప్రకటించారు. అంతేకాక విద్యాసంస్థల బాధ్యులు, వ్యాపార సంస్థల ప్రతినిధులను కోరడంతో వారు కూడా సానుకూలంగా స్పందించారు. బంద్ ద్వారా రిజర్వేషన్ల ఆవశ్యకతను చాటిచెప్పడమే కాక అందరి మద్దతుతో సాధించుకోవడమే తమ లక్ష్యమని బీసీ సంఘాల నాయకులు చెబుతున్నారు.

జేఏసీ సమావేశం

రిజర్వేషన్ల సాధనకు శుక్రవారం చేపడుతున్న బంద్‌ను జయప్రదం చేసేందుకు బీసీ సంఘాల జేఏసీ నేతలు శుక్రవారం ఖమ్మంలో సమావేశమయ్యారు. ఈసమావేశంలో గుండాల కృష్ణ, బొమ్మ రాజేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, కూరపాటి వెంకటేశ్వర్లు, తాటి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసరావు, యర్రా శ్రీనివాసరావు, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు. బంద్ విజయవంతం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఖమ్మం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో బంద్ జరిగేలా అన్ని పార్టీలు, సంఘాల నేతలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అంతేకాక జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విజయవంతానికి ప్రచారం నిర్వహించారు.

ఉపాధ్యాయ సంఘాల మద్దతు

ఖమ్మం సహకారనగర్: బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యాన బంద్‌కు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఈమేరకు ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, పీఆర్‌టీయూ నాయకుడు సతీష్ శుక్రవారం ఎస్టీఎఫ్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడమనే నిర్ణయం సమానత్వానికి దారి తీసే చారిత్రక నిర్ణయమన్నారు. ఈమేరకు రాష్ట్రం నుంచి పంపిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు. నాయకులు బుర్రి వెంకన్న, ఉద్దండ్, సతీష్, యాదగిరి, మన్సూర్, కత్తి. నెహ్రూ శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకన్న, మాదాల. నాగేశ్వరరావు, స్వర్ణకుమార్, సంగమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సభకు సీపీఐ శ్రేణులను సిద్ధం చేయండి



మాట్లాడుతున్న దండి సురేష్

ఖమ్మంమయూరిసెంటర్/చింతకాని: సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభకు సంబంధించి పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలని జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ఈమేరకు జిల్లాలోని ప్రతీ ఇంటికి శతాబ్ది ఉత్సవాల సందేశాన్ని అందించాలని ఆయన తెలిపారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం నగర కార్యదర్శి ఎస్.కే.జానీమియా అధ్యక్షతన జరిగిన సమావేశంతో పాటు చింతకానిలో చాట్ల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సురేష్ మాట్లాడారు. పార్టీ ప్రస్థానంలో అనేక విజయాలు ఉన్నాయని, వీటిని నేటి తరానికి తెలియజేసే లక్ష్యంతో శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ అగ్రనాయకత్వంతో పాటు 40దేశాల ప్రతినిధులు హాజరయ్యే సభ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని సురేష్ కోరారు. ఈ సమావేశాల్లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యుడు మహ్మద్ సలాం, నాయకులు కొండపర్తి గోవిందరావు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, తాటి నిర్మల, వరదా నర్సింహారావు, బోడా వీరన్న, సైదా, రవికుమార్, కూచిపూడి రవి, దూసరి శ్రీరాములు, దూసరి గోపాలరావు, మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, దొబ్బల వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లీకుమారుడి హత్య కేసులో జీవిత ఖైదు

నిందితుడికి రూ.25వేలు జరిమానా కూడా..

సత్తుపల్లిటౌన్: తల్లీకొడుకుల గొంతు కోసి అమానుషంగా హత్యచేసిన ఘటనలో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువడింది. అలాగే, రూ.25వేల జరిమానా విధిస్తూ సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలిలా ఉన్నాయి.

నగదు చోరీ కోసం వెళ్లి...

సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దర్శనపు సునీల్ అలియాస్ మహేష్ విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించడమే దృష్టి సారించాడు. ఈక్రమాన 2023 జూలై 31వ తేదీన అదే గ్రామానికి చెందిన రాయల తులశమ్మ పెన్షన్ డబ్బు కోసం సత్తుపల్లి బ్యాంక్‌కు వెళ్లి నారాయణపురం వచ్చేందుకు రూ.100 అద్దెకు ఆటో మాట్లాడుకుంది. పాత సెంటర్‌లో కిరాణ సరుకులు, బియ్యం తీసుకునే క్రమాన ఆమె పర్సులో రూ.500 నోట్ల కట్టను సునీల్ గమనించాడు. దీంతో నగదు చోరీ చేయాలని నిర్ణయించుకున్న ఆయన మధ్యలోనే ఆపేసి ఇంకో ఆటోలో వెళ్లాలని సూచించాడు. ఈమేరకు తులశమ్మ మరో ఆటోలో ఇంటికి చేరింది. ఆపై సునీల్ అదేరోజు అర్ధరాత్రి గడ్డికోసే కొడవలితో తులశమ్మ ఇంటికి వెళ్లగా ఆమె గడి వేయకపోవడంతో తేలిగ్గా లోనకు ప్రవేశించాడు. ముందు గదిలో మంచంపై నిద్రిస్తున్న తులశమ్మ, వెనుక గదిలో ఉన్న మతిస్థిమితం లేని ఆమె కొడుకు సత్యనారాయణ గొంతు కోసి అమానుషంగా హత్య చేశాడు. విచారణలో భాగంగా సునీల్‌ను నిందితుడిగా గుర్తించిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా విచారణ అనంతరం ఆయనకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూజడ్జి మారగాని శ్రీని వాస్ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసు ను ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన ఏపీపీ అబ్దుల్‌బాషాతో పాటు సీఐలు మోహన్‌బాబు, టి.శ్రీహరి, సీడీఓ వి.నరేష్, ఎస్సై కె.శ్రీకాంత్, హెచ్‌సీలు శ్రీనివాస్, నాగేశ్వరరావును సీపీ సునీల్‌దత్ అభినందించారు.

తనిఖీల్లో రూ.34వేల జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని పలు షాప్‌ల్లో కేఎంసీ అధికారులు శుక్రవారం తనిఖీ చేపట్టారు. ఆయా షాపుల్లో నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ సంచులను గుర్తించి సీజ్ చేశారు. ఈమేరకు నాలుగు షాప్‌లు, ఓ వైన్‌షాప్, ఓ బార్‌లో ఎనిమిది కిలోల ప్లాస్టిక్ సంచులను సీజ్ చేసి రూ.22 వేల జరిమానా విధించారు. అంతేకాక పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్న మూడు ఖాళీ స్థలాల యజమానులకు రూ.12వేలు జరిమానా విధించారు. తనిఖీల్లో శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనమైన కుటుంబ వ్యాపార నేపథ్యం ఉన్నంత మాత్రాన...
'విజయం అనివార్యం' అని చెప్పడానికి లేదు.
అంకితభావం, కష్టం ఉంటేనే విజయం సొంతం అవుతుంది.
ఘనమైన కుటుంబ వ్యాపారనేపథ్యం లేనంత మాత్రాన...
'విజయం దూరం' అని చెప్పడానికి లేదు.
ఆసక్తికి అంకితభావం, కష్టం తోడైతే విజయం సొంతం అవుతుంది.
దీనికి తాజా ఉదాహరణ... అవెండస్ వెల్త్-హురున్ ఇండియా-2025 జాబితా.
35 ఏళ్ల లోపు ప్రతిభావంతులైన 155 మంది యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు వెల్త్-హురున్ ఇండియా జాబితాలో చోటు సాధించారు.
వీరిలో...
వారసత్వ బాధ్యతకు తమ శక్తియుక్తులను జోడించి తమదైన గుర్తింపు తెచ్చుకున్నవారు ఉన్నారు. కొన్ని ఉత్పత్తులలో లోపాలు కనిపెట్టి లోపాలు లేని, సౌకర్యవంతమైన ప్రాడక్ట్స్ కోసం ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారి విజయం సాధించిన వారూ ఉన్నారు... వారిలో కొందరు యంగ్ ఫిమేల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి..

యువ హవా


అవంతిక సరౌగి

దేశంలో తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్

చెరకు, బయోప్లాస్టిక్‌కు సంబంధించిన ఆపరేషన్‌లలో యువ మార్గదర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది అవంతిక సరౌగి. కాలిఫోర్నియాలో చదువుకున్న అవంతిక తమ బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్ లిమిటెడ్ (బీసీఎంఎల్)ను పీఎల్‌ఏ (పాలీలాక్టిక్ యాసిడ్) తయారీ సౌకర్యాన్ని అందించే కంపెనీగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో ఉంది. ఇది మన దేశంలోని మొట్ట మొదటి బయోప్లాస్టిక్ ప్లాంట్ కానుంది.

పీఎల్‌ఏ అనేది చెరకు పునరుత్పాదక వనరుల నుండి తయారైన బయో ఆధారిత, కంపోస్టబుల్, తక్కువ ఉద్గారాల ప్లాస్టిక్. దీనిని సాధారణంగా ప్యాకేజింగ్, త్రీడి ప్రింటింగ్‌లో ఉపయోగిస్తారు.

మన దేశంలోని ఈ తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్ వల్ల బీసీఎంఎల్ లాభాల బాటలో పయనించనుంది. టర్నోవర్ పెరగనుంది. పర్యావరణ అనుకూలంగా కూడా మారనుంది.

తరగతి గదిని మార్చేలా


పరిత పరేఖ్

వినూత్నమైన ఆలోచన విధానంతో విద్యా, సాంకేతిక రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ పరిత పరేఖ్. బ్రౌన్ యూనివర్శిటీలో చదువుకుంది. బ్రౌన్ తరువాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో 'ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్'పై మాస్టర్స్ చేసింది. స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకునే రోజుల్లో పిల్లల విద్యావిధానం మీద దృష్టి పెట్టేది. స్టాన్‌ఫోర్డ్‌లో చేసిన పరిశోధనలు, నేర్చుకున్న ఆధునిక సాంకేతిక విషయాలు ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించాయి.

కట్టింగ్-ఎడ్జ్ ఎడ్యుకేషనల్ టెక్ ప్లాట్‌ఫామ్ 'టొడెల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించింది పరిత. మూస బోధన పద్ధతులకు అతీతంగా ఆధునిక బోధన పద్ధతులు, ఆలోచనలతో 'టొడెల్' ప్లాట్‌ఫామ్‌కు రూపకల్పన చేసింది. 'టొడెల్' ప్రభావంతో చాలా బడులలో ఉపాధ్యాయుల బోధన పద్ధతి మారింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంప్రదాయ, ఆధునిక విద్యాబోధనలో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి 'టొడెల్' కృషి చేస్తోంది.

విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించే ప్రణాళికలతో 'టొడెల్' విద్యాప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సాధించింది.


మీనా మార్గరెట్

సక్సెస్‌ఫుల్ యూఎస్పీతో...

ప్రారంభ కష్టాల మాట ఎలా ఉన్నా... ఉమెన్ యాక్టివేర్ 'బ్లిస్‌క్లబ్' మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఈ ఆన్‌లైన్ బ్రాండ్ ఆ తరువాత రెండు ఆఫ్‌లైన్ స్టోర్‌లను కూడా లాంచ్ చేసి విజయం సాధించింది. 'మార్కెట్‌లో ఎన్నో బ్రాండ్‌లు ఉన్నాయి కదా. మీ ప్రత్యేకత ఏమిటి?' అనే ప్రశ్న 'బ్లిస్‌క్లబ్' ఫౌండర్, సీయీవో మినూ మార్గరెట్ ముందు వచ్చి నిల్చుంది. సిగ్నేచర్ ఫ్యాబ్రిక్స్, వినూత్నమైన ప్రాడక్ట్ డిజైన్‌ను తమ కంపెనీ యూఎస్పీగా చేసుకొని విజయం సాధించింది మార్గరెట్.

నేషనల్ లెవెల్ ఫ్రీస్బీ ప్లేయర్ అయిన మినూ మార్గరెట్ యాక్టివేర్‌కు సంబంధించిన డీసెంట్ ఆప్షన్స్ గురించి ఆలోచిస్తున్నప్పుడు 'బ్లిస్‌క్లబ్' స్టార్టప్ ఆలోచనవచ్చింది.

'యాక్టివేర్ రంగంలోని కంపెనీలు డిజైన్ ఫస్ట్ విధానాన్ని అనుసరిస్తాయి. మేము మాత్రం ఈ విధానానికి దూరంగా ఉన్నాం. బ్లిస్‌క్లబ్‌కు డిజైన్ క్లబ్ లేదు. ప్రాడక్ట్ ఇంజినీరింగ్ టీమ్ మాత్రమే ఉంది. ఈ టీమ్ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం యాక్టివేర్ సౌలభ్యానికి సంబంధించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడం. ఉదాహరణకు చెన్నైలోని ఒక మహిళ గురించి. వేడి వాతావరణంలో ఆమెకు లెగ్గింగ్స్ ధరించడం కష్టమయ్యేది. ఇలాంటి సమస్యను దృష్టిలో పెట్టుకొని వేడివాతావరణంలో కూడా సౌకర్యంగా ఉండే లెగ్గింగ్స్‌ను డిజైన్ చేశాం' అంటుంది మార్గరెట్.


నీతూ యాదవ్ - కీర్తి జాంగ్ర

చిన్న గదిలో మొదలై... కోట్ల టర్నోవర్ వరకు

బెంగళూరులోని చిన్న గదిలో మొదలైన 'యానిమల్' రూ.550 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ స్థాయికి చేరింది. ఐఐటీ-ఢిల్లీలో చదువుకున్న కీర్తి జాంగ్ర, నీతూ యాదవ్‌ల బ్రెయిన్ చైల్డ్ 'యానిమల్'. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అవ్యవస్థీకృతంగా ఉన్న మన దేశంలోని పశువుల మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

పశువుల క్రయవిక్రయాలలో 'యానిమల్' యాప్ కీలక పాత్ర పోషిస్తోంది. తమ స్టార్టప్‌ను ప్రారంభించడానికి ముందు సర్వే నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు కీర్తి, నీతూ యాదవ్. డైరీ ఇండస్ట్రీలో కీలకమైన మార్పు తేవాలనుకున్న కీర్తి, నీతూ యాదవ్‌లు 'యానిమల్' యాప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా మనం ఉన్న చోటు నుంచే వందల కిలోమీటర్‌ల దూరంలో పశువుల క్రయ విక్రయాలు జరుగుతున్న ప్రదేశం తదితర వివరాలు తెలుసుకోవచ్చు.



దీపావళి వెనుక ఉన్న పురాణాలు

పిల్లలూ... మీకు ఇష్టమైన పండుగలలో దీపావళి ముందు వరుసలో ఉంటుంది కదూ.
దీపాలు వెలిగించడం, టపాసులు పేల్చడం, పిండివంటలను ఆరగించడం...
భలే సరదా. అయితే అసలు దీపావళి పండుగ ఎందుకు జరుపుకుంటాం, ఈ వేడుక వెనకున్న కథలేంటి తెలుసుకుందాం.

నేటి 'సాక్షి ప్లస్' కిడ్స్ ఈపేపర్‌లో

వంటిల్లు

తియ్యటి వేడుక

ముచ్చటగా అలంకరించిన లోగిళ్లు
అందంగా ముస్తాబైన చిన్నా పెద్దలు
ఓ వైపు దీప కాంతులు
మరోవైపు బాణాసంచా పేలుళ్లు
ఆనందాలు విప్పారుతుండగా
తియ్యని రుచులు నోరారా ఆస్వాదిస్తుంటే
వేడుకంతా నట్టింట్లో కొలువుదీరినట్టే ఉంటుంది.
రెట్టింపు ఆనందాలను పంచడానికి
వంటిల్లు తీపి వంటకాలను
సిద్ధం చేస్తూనే ఉంటుంది.
ఎక్కువ శ్రమ లేకుండా పండగవేళ
తియ్యని రుచులను సులువుగా చేసేద్దాం.
ఇంటిల్లిపాదికి ఆనందాన్ని పంచేద్దాం..



సూజీ హల్వా

కావలసినవి: సూజీ (బొంబాయి రవ్వ) - కప్పు; నీళ్లు - 2 కప్పులు; పంచదార - కప్పు; నెయ్యి - 3 టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి - పావు టీ స్పూన్; జీడిపప్పు, కిస్‌మిస్ - అవసరమైనంత.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడిపప్పు, ద్రాక్ష వేయించాలి. ● వాటిని తీసి, అదే నెయ్యిలో సూజీ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● మరో పాత్రలో నీరు మరిగించి, రవ్వ పోస్తూ, కలపాలి. ● రవ్వ ఉడికిన తర్వాత పంచదార కలిపి తర్వాత యాలకుల పొడి వేసి కలపాలి. ● చివరగా వేయించిన కాజూ, ద్రాక్ష వేసి మిక్స్ చేయాలి.



గులాబ్ జామూన్

కావలసినవి: రెడీమేడ్ జామూన్ మిక్స్ - కప్పు; నీళ్లు/పాలు - అవసరమైనంత (జామూన్ మిక్స్ కలపడానికి); పంచదార - ఒకటింపావు కప్పులు; నీళ్లు - కప్పు; యాలకుల పొడి - చిటికెడు.

తయారీ: ● పంచదార, నీళ్లు కలిపి, మరిగించి సిరప్ తయారు చేయాలి. దాంట్లో చిటికెడు యాలకుల పొడి కలపాలి ● జామూన్ మిక్స్‌కి కొంచెం నీళ్లు లేదా పాలు జోడించి మృదువుగా కలపాలి ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, ఉండలు చేయాలి ● బాణలిలో నూనె పోసి వేడయ్యాక, సిద్ధంగా ఉంచుకున్న ఉండలు వేసి, వాటిని గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి ● వేయించిన జామూన్లను వేడి సిరప్‌లో వేసి, రెండు గంటలు నాననివ్వాలి.



రైస్ పుడ్డింగ్ / పాయసం

కావలసినవి: బియ్యం - పావు కప్పు; పాలు - 3 కప్పులు; పంచదార - పావు కప్పు; యాలకుల పొడి - పావు టీ స్పూన్; యాలకులు, కిస్‌మిస్ - అవసరమైనంత; నెయ్యి - టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యం కడిగి, కొద్దిగా ఉడికాక పాలు పోసి, మెల్లిగా మరిగించాలి. ● బియ్యం పూర్తిగా ఉడికాక పంచదార కలపాలి. ● యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి.



బేసిన్ లడ్డూ

కావలసినవి: బేసన్ (సెనగపిండి) - కప్పు; నెయ్యి - పావు కప్పు; పంచదార పొడి - పావు కప్పు; యాలకుల పొడి - పావు టీ స్పూన్.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేసి, వేడి చేయాలి. మంట బాగా తగ్గించి, దాంట్లో శనగపిండి వేసి, మెల్లగా బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● చల్లారిన తర్వాత పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి. ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, చేతులతో లడ్డూలు చేయాలి.

ధన త్రయోదశి

ఆరోగ్యమస్తు ధనప్రాప్తిరస్తు



నేడు ధనత్రయోదశి. సాధారణంగా ధన త్రయోదశి అనగానే బంగారం, వెండి, ఇతర గృహోపకరణాలు కొనడం అందరూ చేసేదే. అయితే ధనత్రయోదశి ప్రాశస్త్యాన్ని తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ఆ కథ తెలుసుకుందాం.

దేవతలు, దానవులు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలుకుతున్న సమయంలో ఆ క్షీరసాగరం నుంచి శ్రీ మహాలక్ష్మి జన్మించింది. అంతే కాదు సంపదలను ప్రసాదించే కల్పవృక్షం, కామధేనువు, దేవవైద్యుడు ధన్వంతరి కూడా శ్రీ మహాలక్ష్మితో పాటే జన్మించారు. ఆ రోజు ఆశ్వయుజ బహుళ త్రయోదశి. శ్రీమహాలక్ష్మి .., ధనానికి ప్రతిరూపం. అందుకే., ఆమె జన్మదినమైన ఈ ఆశ్వయుజ కృష్ణ త్రయోదశిని.. 'ధన త్రయోదశి' అన్నారు.

ఎంత చదువు చదివినా..,, ఎన్ని తెలివితేటలు ఉన్నా., శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లేకపోతే జీవితం గడపడం కష్టం. అందుకే.. సర్వ సంపత్‌ప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం సర్వ మానవాళి ఈ రోజున శ్రీమహాలక్ష్మిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, ఆమె ఆశీస్సులు అందుకుంటారు.

ధనానికి అధిదేవత 'శ్రీమహాలక్ష్మి. ధనానికి అధినాయకుడు ఉత్తర దిక్పాలకుడైన 'కుబేరుడు'. అందుకే ఈ ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మితోపాటు కుబేరుని కూడా ఆరాధిస్తారు. సాధారణంగా ఈ లక్ష్మీ పూజను సాయం సమయంలో ప్రదోష వేళలో చేసుకుంటే చాలా మంచిది.

లక్ష్మీ కుబేర వ్రతం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, వ్యాపార అభివృద్ధి అదే విధంగా నూతన వ్యాపారం ప్రారంభించబోయే వారు, ఉద్యోగ అభివృద్ధి కోరుకుంటున్నవారు, అప్పుల బాధలు ఉన్నవారు లక్ష్మీ కుబేర వ్రతాన్ని చేసుకోవడం వల్ల ఆయా బాధల నుంచి విముక్తి పొంది, అన్నింటా అభివృద్ధి జరుగుతుందని పెద్దలు చెబుతారు కాబట్టి ఈ వ్రతాన్ని చేయాలనుకుంటున్న వారు అక్షయ తృతీయ రోజు, ధన త్రయోదశి రోజు, కార్తీక శుక్ల పంచమి రోజు లేదా తొమ్మిది గురువారాలు లేక శుక్రవారాలు చేసుకోవచ్చు.

ధన్వంతరి జయంతి

దేవవైద్యుడు, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అంశావతారమైన ధన్వంతరి పాలసముద్రం నుంచి ఆవిర్భవించింది కూడా ధనత్రయోదశి నాడే. అందుకే ఈ పర్వదినాన చాలామంది ధన్వంతరిని కూడా పూజిస్తారు. ముఖ్యంగా ఆరోగ్యం బాగలేని వారు, ఆయుర్వేద వైద్య విధానం మీద నమ్మకం ఉన్న వారు శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన ధన్వంతరిని పూజించడం వల్ల ఆరోగ్యవంతులవుతారని చెబుతారు. ధన్వంతరి చేతిలో శంఖు చక్రాలతోపాటు ఔషధ భాండం లేదా అమృత కలశం, జలగ ఉంటాయి. జలగ శరీరంలో చేరిన చెడు రక్తాన్ని పీల్చివేసి ఆరోగ్యాన్నిస్తుందని ప్రతీతి. అందుకే ధన్వంతరి చేతిలో జలూకం అంటే జలగ ఉంటుంది.

నేడు శని త్రయోదశి కూడా. ధనత్రయోదశి నాడే శని త్రయోదశి కూడా రావడం చాలా విశేషం. అందువల్ల ఈ వేళ పాత వస్తువులు, పాత ఆలోచనలు, పాతదనాన్ని వదిలించుకుని, కొత్త వస్తువులు కొనుగోలు చేయటం, కొత్త ఆలోచనలు చేయటం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం చాలా మంచిది.


పితృదేవతాపూజకు కూడా ధనత్రయోదశి చాలా ప్రశస్తమైనది. ధనత్రయోదశి నాడు ఇంటిలో దీపాలు వెలిగించి, మన పెద్దవారిని తలచుకోవడం వల్ల వారి ఆశీర్వాదంతో శుభం చేకూరుతుందని పండితులు చెబుతారు. ఈ శుభవేళ అందరికీ కీడు తొలగి మేలు చేకూరాలని కాంక్షిద్దాం.

– డి.వి.ఆర్.

ఏఐ మ్యారేజ్ ప్రపోజల్

ప్రేమలేఖల నుంచి ఎస్‌ఎంఎస్‌ల వరకు లవ్, మ్యారేజ్ ప్రపోజల్స్ పలు రకాలు. తాజా విషయానికి వస్తే...ఒక కుర్రాడు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ను ఉపయోగించి ఫేక్ డిస్నీ-స్టైల్ ట్రైలర్ ద్వారా తన స్నేహితురాలికి మ్యారేజ్ ప్రపోజ్ చేశాడు. ఈ వీడియోకు 11 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.





ఈ వీడియోను ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీషేర్ చేస్తున్నారు.

'ది ఈజీయెస్ట్ యస్. యస్, ప్రపోజ్‌డ్ టు జె... యూజింగ్ ఏఐ' అని వీడియోకు కాప్షన్ ఇచ్చారు.

వీడియో చివరలో 'విల్ యూ మ్యారీ మీ' అనే కామెంట్ కనిపిస్తుంది. ఇంతకీ ఆ అమ్మాయి 'యస్' చెప్పిందా? యస్!

'ది మోస్ట్ బ్యూటీఫుల్ మ్యారేజ్ ప్రపోజల్' అంటూ స్పందించారు నెటిజనులు.



వామ్మో.. ఏ(ఐ)డడుగులు..!

మన పురాతన తాటాకు శాసనాల గ్రంథాల్లో అన్నీ ఉన్నాయో లేవోగానీ... మన సినిమాల్లో మాత్రం సకల విజ్ఞాన శాస్త్రాలూ ఉన్నాయి. అందుకు నిదర్శనమే మనదైన పానిండియన్ సూపర్‌హిట్ బ్లాక్‌బస్టర్ సినిమా 'రోబో'!

ఏ అద్భుత ముహూర్తాన మన డైరెక్టర్ శంకర్ 'రోబో' తీశాడోగానీ... లోకమంతటా అవే వింతలు అచ్చం అలాగే జరుగుతున్నాయి. ఉదాహరణకు...

ఇక్కడి మన సినిమాలో హ్యూమనాయిడ్ రోబో కాస్తా మానవ మానస వికాసాలూ, వికారాలూ ఒంటబట్టించుకుని 'రోబో సేపియన్' అవుతాడా! అలా అవ్వగానే ఆ 'టాయ్'ఫ్రెండు కాస్తా హీరోయిన్‌కి 'బాయ్'ఫ్రెండుగా మారి... అచ్చం మన మానవ కుర్రాళ్లలాగే... తనను ప్రేమించని అమ్మాయి మీద యాసిడ్లూ గట్రా విసిరేంత క్రూరమైన 'సెల్ఫ్‌స్టైల్డ్ లవర్‌బా(టా)య్'గా మారిపోతాడు కదా.

అక్కడ అమెరికాలోని ఒహాయో రాష్ట్ర చట్టనిపుణులు బహుశా 'రోబో' సినిమా చూసి హడలిపోయి ఉంటారేమో... మానవ మేధకూ, కృత్రిమ మేధస్సుకూ మధ్య వివాహాలు వద్దంటే వద్దంటూ గొడవ గొడవ చేస్తున్నారు. అంతేనా... ఆ మేరకు ఓ చట్టం తీసుకువచ్చేందుకు బిల్లు కూడా ప్రిపేర్ చేశారు.

అదే డైరెక్టర్ శంకర్‌గారి ఆయొక్క అదే 'రోబో' సినిమాలో... ''ఇనుములో ఓ హృదయం మొలిచెలే'' పాటనుంచి స్ఫూర్తి పొందినట్టుగా... ఇప్పటికే మన పొరుగు దుండగీడైన చైనావాడు 'దివిరి ఇసుకన తైలంబు' రీతిగా దివిరి ఇనుమున గర్భసంచి నుంచి చిన్నారి పాపలను రేపీపాటికి తీసిస్తానంటూ తొడలుగొడుతూ, హడలగొడుతున్నారన్న సంగతి తెలిసిందే. అంతే కాదు... రోబోలకు సీమంతాలవీ గట్రా చేసేసి కృత్రిమ 'ఊంబ్'ల లోంచి ఉంగా ఉంగా పాపాయిలను పుట్టిస్తానంటూ సవాళ్లు విసురుతున్నారు కూడా.

అమిత వింతలకు నెలవైన అమెరికాలో... ఈ చిత్ర విచిత్రాలన్నీ చూస్తున్న ఒహాయో రాష్ట్రపు మేధావులు భయపడిపోతున్నారేమో... ఆ ఆందోళనతో స్థిమితంగా ఉండలేక... బహ్మాండమైన ఓ వివాహ నిషేధ చట్టాన్ని తెచ్చేందుకు నిశ్చయించుకున్నారు. ఆ మేరకు బిక్కుబిక్కుమంటూ బిల్లొకదాన్ని అక్కడి చట్టసభల్లో ప్రవేశపెట్టబోతున్నారు కూడా! దీనికి కారణమేంటంటే... అక్కడి కుర్రకారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెళ్లిళ్లు చేసుకునేందుకు తెగ ఉత్సాహపడిపోతున్నారట!

హాయ్యో...! ఇప్పటికే అతి మేధావులైన మానవులూ, అమితమైన మేధస్సుల 'కృత్రిమ మేధ' మధ్య పెళ్లిళ్లు జరిగితే... రేపు సదరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కాస్తా పవరాఫ్ ఆటార్నీలంటూ పవర్‌పట్టా తీసుకోవడం, పార్ట్‌నర్‌తో చెట్టాపట్టాలే కాకుండా, లీగల్ వ్యవహారాల్లోకి దూరి, అసలు నిపుణులు తట్టాబుట్టా సర్దుకునేలా, చెట్టాపుట్టా పట్టుకుపోయేలా, బెదిరీ చెదిరీ పోయేలా చేస్తాయేమోనని హడలెత్తుతున్నారు 'ఒహాయో రాష్ట్ర'పు చట్ట నిపుణులు.

అందుకే... మనుషులకూ, యంత్రాలకు మధ్య పెళ్లి మంత్రాలు వద్దంటే వద్దంటూ పట్టుపడుతున్నారు. మానవులూ, యాంత్రాల మధ్య మనువులు వద్దంటూ వాదిస్తున్నారు. ఇది 'యంత్రమాత్రమూ' తగదంటూ బల్లగుద్ది మరీ శాసిస్తున్నారు మన ఒహాయో స్టేట్ రిప్రెజెంటేటివూ, రిపబ్లికన్ మెంబరూ అయిన మిస్టర్ 'థాయిడస్ క్లాగెట్' గారు!

అలనాడెప్పుడో బ్రహ్మంగారు చెప్పిన వింతలన్నీ అక్కడా ఇక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడీ నేపథ్యంలో ఈ పుట్టు తెలివితేటలున్న మన మానవాళీ... పెట్టు తెలివితేటలున్న రోబోయంత్రాళీ... కలగలసి సంకరమైతే... రేపు భవిష్యత్తులో సకల 'అతి'తెలివితేటలున్న బుజ్జిబుజ్జి రోబో-కంగాళీలకు ఆస్కారముంటుందేమోనని అనుమానిస్తున్నారు.

అచ్చం రోబో సినిమాలోలాగే... రేపెప్పుడైనా పొరబాటున ఆ 'చిట్టి' చిట్టి రోబోలకు విలనీయులైన ఏ అడ్డమైన సైంటిస్టులో 'రెడ్డు చిప్పు' పెడితే... అప్పుడది మన మానవాళి చేతికి 'డేంజరు చిప్పే'ననేమోనంటూ ఇన్నిరకాల ఆంక్షలూ, హాహాకారాలంటూ లోకంలోని ప్రజలంతా తెగ చెవులు కొరుక్కుంటున్నారన్నది అభిజ్ఞ వర్గాల అతి రహస్య భోగట్టా.

– యాసీన్

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) అక్టోబర్ 17న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,34,990	1,35,150	1,32,770	1,35,150	1,32,500	1,33,090
బంగారం (22 క్యారెట్లు)	1,24,590	1,21,700	1,21,700	1,25,350	1,21,900	1,22,000
వెండి	1,90,000	1,81,000	2,03,000	1,81,000	1,81,000	2,03,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.